క్లుప్తంగా

దేశాభివృద్ధికి కృషి చేయాలి



పామర్రు: ప్రతిఒక్కరూ జాతీయతా భావాన్ని పెంపొందించుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా హర్ ఘర్ తిరంగా అభియాన్‌-యాత్రను జెడ్పీ హైస్కూల్లో టీడీపీ, బీజేపీ, జనసేన తదితర పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఊపి ఎమ్మెల్యే ర్యాలీని ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, నాయకులు గుంపా గంగాధరరావు, బీజేపీ నాయకులు సతీష్, రాజబాబు, కె.రమేష్‌బాబు, ఓ.రమేష్‌బాబు, రామిరెడ్డి, టీడీపీ నాయకులు గణేష్, ప్రవీణ్ చంద్ర ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చు

గుడివాడరూరల్: విద్యుత్ బిల్లులు ఇక నుంచి ఫోన్, గూగుల్ పేల ద్వారా చెల్లింపులు చేయవచ్చని మండల విద్యుత్‌శాఖ ఏఈ ఎన్.సురేష్ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు జరిమానా లేకుండా బిల్లు వచ్చిన 15రోజుల్లోగా చెల్లింపులు చేయాలని కోరారు. ఇలా చేస్తే సర్ చార్జీలు కూడా కట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. వీలైనంత త్వరగా బిల్లులు చెల్లించి తమకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా ఆన్‌లైన్ పేమెంట్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

గుడివాడ ఎంపీడీఓగా వెంకటరమణ

గుడివాడరూరల్: మండల అభివృద్ధి అధికారిగా అనగాని వెంకటరమణ బదిలీపై గుడివాడ రానున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుడివాడ నుంచి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలానికి వెళ్లారు. వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారని మండల పరిషత్ అధికారులు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

ముదినేపల్లి రూరల్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి పేర్కొన్నారు.
మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో పెయ్యేరు ఎస్టీ కాలనీలో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ ఆరోగ్య సేవలు అందరూ వినియోగించుకోవాలన్నారు. నూతన చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎస్.శ్వేత, డి.శివప్రసాద్, ఎంఎస్ఎస్.రాజ, ఎంఎల్‌హెచ్‌పీ డి.ఉషారాణి, వీఆర్వో కె.కేశవ పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మి

గ్రామాల అభివృద్ధికి సహకారం

గుడ్లవల్లేరు: కొత్త ప్రభుత్వంలో జరిగే గ్రామాల్లోని అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని ఎంపీపీ కొడాలి సురేష్ అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని వివిధ సమస్యలపై పలు శాఖల అధికారులతో ప్రజాప్రతినిధులు సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ డి.కృష్ణవేణి, వైస్ ఎంపీపీ శాయన రవి, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అవయవ దానంపై అవగాహన

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే రక్త, అవయవ దానంపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్ అన్నారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఏడాదికి రెండు పర్యాయాలు రక్తదానం చేయవచ్చన్నారు. అదేవిధంగా ప్రమాదాలు సంభవించి మెదడు పనిచేయని వారు గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, క్లోమం, మూత్రాశయం, పెద్ద, చిన్నపేగు వంటివి దానం చేయవచ్చన్నారు. అదేవిధంగా మరణానంతరం నేత్రాలు కూడా దానం చేయవచ్చన్నారు. హెచ్ఎం టీఎంఈరాణి, రెడ్‌క్రాస్ సొసైటీ గుడివాడ శాఖ చైర్మన్ మడకా ప్రసాదు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా వీరనారాయణ

పామర్రు: మండలంలోని పెదమద్దాలికి చెందిన పామర్తి వీరనారాయణ వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా ఎంపికయ్యారు. ఇటీవల సికింద్రాబాద్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు, ప్రముఖ సినీ నటుడు కేవీ ప్రదీప్ చేతుల మీదుగా వ్యక్తిత్వ శిక్షకుడిగా సర్టిఫికెట్ అందుకున్నారు.



వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా సర్టిఫికెట్ అందుకుంటున్న వీరనారాయణ

స్నేహితుడికి ఆర్థిక సాయం

కైకలూరు: చిన్ననాటి స్నేహితుడికి ఆపద రావడంతో పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేసి స్నేహహస్తాన్ని చాటుకున్నారు. కై కలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 1985–86 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారిలో బందా రమేష్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతడికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మల్లారెడ్డి హాస్పిటల్లో చేర్చారు. విషయం తెలుసుకున్న 51 మంది పూర్వ విద్యార్థులు కైకలూరుకు చెందిన లక్కింశెట్టి మోహన్ ఆధ్వర్యంలో రూ.1,03,500 సేకరించి స్నేహితుడి వైద్యం నిమిత్తం పంపారు.

గ్రంథాలయానికి వాటర్ ఫిల్టర్ వితరణ



పెదపారుపూడి: గ్రంథాలయానికి దాతలు సాయం మరవలేనిదని గ్రంథాలయాధికారి ఎంవీఎస్ లక్ష్మీ అన్నారు. పెదపారుపూడి గ్రంథాలయానికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాజ విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట లక్ష్మీప్రసాద్ వాటర్ ఫిల్టర్‌ను మంగళవారం వితరణగా అందజేశారు.

17 నుంచి రెవెన్యూ సదస్సులు

మొవ్వ: గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామాల్లోనీ నెల 17వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కే మస్తాన్ రావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు వీఆర్వోలకు సమావేశం నిర్వహించి అధికారులకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సూచనలిచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కైకలూరులో 16 నుంచి..

కైకలూరు: భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించే గ్రామ రెవెన్యూ సదస్సులు ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు కొనసాగుతాయని కైకలూరు తహసీల్దారు ఎం.ఉదయభాస్కరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధిత అధికారులు హాజరవుతారని తెలిపారు.

మహిళా సాధికారత సాధించాలి

కైకలూరు: మహిళలు సాధికారిత సాధన దిశగా పయనించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి చెప్పారు. దొడ్డిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో కేంద్ర ప్రభుత్వ మిషన్ శక్తి కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సరళ, పి.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ దిమ్మ పనుల పరిశీలన

మండవల్లి: స్థానిక గ్రామ సచివాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని నూతనంగా ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ దిమ్మ వద్ద నిర్వహిస్తున్న పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ మంగళవారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

పామర్రు ఎంపీడీఓగా రామకృష్ణ

పామర్రు: పామర్రు ఎంపీడీఓగా యద్దనపూడి రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీను పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు శ్రీనివాసరావు, రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, కార్యాలయం సూపరింటెండెంట్ ప్రమీళ స్వాగతం పలికారు.

ఎస్సీ వర్గీకరణపై 16న సమగ్ర చర్చ

గుడివాడ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ నెల 16వ తేదీన స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సమగ్రంగా చర్చించి, దానిపై చర్యలు తీసుకునేందుకు గుడివాడ నియోజకవర్గ దళితులు, మాలల సంఘాల భేటీని విజయవంతం చేయాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు కోరారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం దళిత నేతల సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వలన మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడం తప్ప ఒరిగేదేమీ లేదన్నారు. ఎస్సీ నాయకులు దారం ఉపేంద్ర, రాంబాబు, వీరాస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు కిట్స్ పంపిణీ

మండవల్లి: మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ బేతపూడి రవితేజ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా మంగళవారం స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

హరేకృష్ణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

గుడివాడరూరల్: లక్షల మంది ఆకలి తీరుస్తున్న హరేకృష్ణ మూమెంట్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యే రాము స్వగృహంలో చారిటబుల్ ఫౌండేషన్ ఏపీ ప్రతినిధులతో ఎమ్మెల్యే రాము మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గుడివాడ ప్రాంతంలో ఉన్న అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న సేవలను ఫౌండేషన్ ఏపీ వైస్ చైర్మన్ విలాస్ విగ్రహదాస, రఘునందనదాస్‌లు ఎమ్మెల్యేకు వివరించారు. గుడివాడలో ఫౌండేషన్ వంటశాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడివాడలో అవకాశం ఉన్న చోట వంటశాల నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని కేటాయిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు కృష్ణ భగవాన్‌ని ఫొటో, భగవద్గీతను ఫౌండేషన్ సభ్యులు అందించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాముకు భగవద్గీతను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పంచాయతీ కార్యదర్శుల నియామకం

ముదినేపల్లి రూరల్: మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వడాలి కార్యదర్శిగా ఆగిరిపల్లి మండలం నరసింగపాలెం నుంచి కె.సంగమయ్య, శ్రీహరిపురం కార్యదర్శిగా కామవరపుకోట మండలం ఉప్పలపాడు నుంచి వై.వెంకట అప్పారావు, వణుదుర్రు కార్యదర్శిగా దెందులూరు మండలం సోమవరప్పాడు నుంచి ఎం.శ్రీకాంత్, పెదగొన్నూరు కార్యదర్శిగా కొయ్యలగూడెం మండలం పరింపూడి నుంచి ఎం.రాధ, వాడవల్లి కార్యదర్శిగా కొయ్యలగూడెం మండలం కన్నాపురం నుంచి కోడే రుక్మిణి, చేవూరు కార్యదర్శిగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం నుంచి టీవీ కృష్ణారెడ్డి, కోడూరు కార్యదర్శిగా దెందులూరు పంచాయతీ నుంచి డి.మైనిజ నియమితులయ్యారు.

సంక్షిప్త వార్తలు

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

నిడుమోలు(మొవ్వ): కేరళలో వయనాడ్ తుపాను బాధితుల సహాయార్థం మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో కౌలు రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులు వర్తక వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు. సోమవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రూ.5,200ను సేకరించినట్లు జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సీపీఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం

ఎలకుర్రు(పామర్రు): గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు చెందిన కొల్లిపర రవీంద్రను మంగళవారం ఘనంగా సన్మానించారు. కేడీబీ ట్రస్టు నిర్వాహకులు కె.నాగేశ్వరరావు, నిడుమోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌తేజ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. బొమ్ములూరు సమీపంలోని టిడ్కో సముదాయం వద్ద వాహన తనిఖీలను మంగళవారం చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు: రైతులు పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఆర్.దివ్య పేర్కొన్నారు. తామరకొల్లులో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం వరి పొలంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, మిత్ర, శత్రు పురుగుల గురించి రైతులకు వివరించారు. మేలైన యాజమాన్య పద్ధతులతో వరి సాగు చేసి, దిగుబడి సాధించే విధంగా రైతులను చైతన్య పరచడమే పొలంబడి ఉద్దేశమని తెలిపారు.